సాక్షి అనకాపల్లి

శుక్రవారం, 13, సెప్టెంబర్, 2024



పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: జన విజ్ఞాన వేదిక నిర్వహించనున్న సైన్స్ సంబరాలు పోస్టర్‌ను బాలల కమిషన్ సభ్యుడు సీతారామ్ గురువారం ఆవిష్కరించారు.



పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.



ముంపు పంటకు నష్టమే..

జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంట మునిగింది. నీటిని తొలగించి కాపాడుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

పసుపు, కుంకుమ అలంకరణలో శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరం: శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పసుపు, కుంకుమ అలంకరణలో కార్యసిద్ధి వినాయకుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సంపూర్ణ అవగాహనతో ఎయిడ్స్ నివారణ సాధ్యం



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఎయిడ్స్‌పై మీకు తెలుసా-2024' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సురక్షితమైన సెక్స్ ప్రాక్టీస్ గురించి అవగాహన పెంపొందించడానికి, దిశ ద్వారా హెచ్ఐవీ-ఎయిడ్స్ వ్యాప్తిని తగ్గించడానికి, ఆరోగ్యకరమైన ఎంపికలను ప్రోత్సహించడానికి ఐఈసీ ప్రచారం-2024 నిర్వహిస్తామని ఆమె తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, ఈఎస్ఏసీఎస్ సీఎస్‌వో డాక్టర్ స్పందన, సీపీఎం రామచంద్ర, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, కేర్ అండ్ సపోర్ట్‌గా ఎస్వీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కనకమహాలక్ష్మి పవిత్రోత్సవాలు



పవిత్రాలు సిద్ధం చేస్తున్న ఈవో శ్రీనివాసుల రెడ్డి, వేదపండితులు, ఆలయ అర్చకులు

డాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన పవిత్రాలు సిద్ధం చేసినట్లు వివరించారు. వార్షిక ఉత్సవాల్లో వైదికపరంగా ఎలాంటి దోషాలు, పొరపాట్లు జరిగినా వాటిని నివారించేందుకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజున సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. అనంతరం పవిత్రోత్సవాలు ప్రారంభిస్తారు. ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 15న ఉదయం 11.30 నుంచి 12.30 గంటలకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేకాలు ఉండవు. 16న ఉదయం ఐదు నుంచి ఆరు గంటల వరకు పంచామృతాభిషేకం, దర్శనాలు నిలిపివేస్తారు. 16న మధ్యాహ్నం పంచామృతాభిషేకం, 12.30 గంటల నుంచి గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

'అరకు' పర్యాటకుల కోసం అదనపు కోచ్‌లు



విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ): అరకు అందాలను వీక్షించే పర్యాటకుల కోసం కిరండూల్ రైళ్లకు వారాంతపు రోజుల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 14, 21, 28వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 15, 22, 29వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

• ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 16, 23, 30వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

వైద్య విద్య.. ఇక మిథ్య



జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల నెలకొల్పి వైద్య విద్యను సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి గండి కొట్టారు.. అందనంత దూరంలో ఉండే మెడికల్ కాలేజీ తమ చెంతకే వస్తుందని సంబరపడ్డ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు.. అనుబంధంగా నెలకొల్పే బోధనాస్పత్రి ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఆశించిన రోగులకు నిరాశ మిగిల్చారు.. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఒకే ఒక్క కారణానికి వైద్య విద్యను మిథ్యగా మార్చారు.

- విద్యార్థుల ఆశలపై 'కూటమి' నీళ్లు
- నర్సీపట్నం మెడికల్ కళాశాలపై ప్రైవేటు'
- ఈ కాలేజీ నిర్వహణను పీపీపీ విధానంలో చేపట్టే యోచన
- పాడేరు మెడికల్ కాలేజీ సీట్ల సంఖ్య 150 నుంచి 50కి తగ్గింపు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు





భీమబోయినపాలెంలో 50 శాతానికి పైగా పూర్తయిన వైద్య కళాశాల భవనాలు

సాక్షి, అనకాపల్లి: వందేళ్ల తర్వాత వచ్చిన మహదవకాశమది.. అవకాశవాద రాజకీయాలకు చేజారిపోయింది.. నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే.. దానికి ఎగనామం పెట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. పాడేరు మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్యను 150 నుంచి 50కి కుదించి విద్యార్థులకు అన్యాయం చేసింది. రానున్న 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని నిర్ణయించిన ఏడు మెడికల్ కళాశాలల్లో ఒక పిడుగురాళ్ల మినహా మిగిలిన 6 (పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు) వైద్య కళాశాలల్లో ప్రభుత్వపరంగా ప్రవేశాలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు అనుగుణంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రముఖ సంస్థలు ముందు కొస్తే వాటికి కళాశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని, చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు సూచించింది. ఇదే జరిగితే నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేట్ వైద్య కళాశాలగా మారడం ఖాయం. భారీ ఫీజు చెల్లిస్తే కానీ సీటు దొరకదు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1923లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాడేరు కాలేజీని పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో కూడా దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజనులకు సైతం అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. కాలేజీ పూర్తయితే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు (నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు.

విద్యార్థులకు అశనిపాతం

నీట్ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు సైతం కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తక్కువ ఖర్చుతో మెడిసిన్ పూర్తి చేయాలని పేదింటి విద్యార్థులు పెట్టుకున్న గంపెడు ఆశలపై ఈ రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు కోసం కొందరు ఏడాదిపాటు, మరికొందరు రెండేళ్లు మూడేళ్ల పాటు కోచింగ్ తీసుకుని నీట్ పరీక్షలు రాసి సీటు సంపాదించుకుంటే.. ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు తగ్గించి వారి ఆశలను అడియాసలు చేసింది. తమ పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కూటమి ప్రభుత్వ విధానాలపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విరుచుకుపడుతున్నారు.



మెడికల్ కళాశాల నమూనా చిత్రం

టీడీపీ అడ్డుపుల్ల

అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా కూటమి పార్టీలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించాయి. తొలి విడతలో అనకాపల్లి టౌన్‌లో ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం కేటాయిస్తే..స్థానిక టీడీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారు. దీంతో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో గల భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళాశాల నిర్మాణం ప్రారంభించింది. 50 శాతానికి పైగా పనులు పూర్తి చేసింది. ఇందులో బోధనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలు, నర్సింగ్ కాలేజ్, వసతి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంది. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లకు తగ్గట్లుగా సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ అత్యాధునిక హంగులతో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఇతర భవనాల నిర్మాణాలు జరిగాయి. 2025 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పనులు చేపట్టింది. కానీ ప్రభుత్వం మారగానే కూటమి ప్రభుత్వం పేదల కళాశాలను ప్రైవేట్ పరం చేసే యత్నం చేస్తోంది.

ధనికులకేనా డాక్టర్ చదువులు



వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడిని దేవుడిలా ఆరాధిస్తారు. వైద్యరంగాన్ని ప్రైవేటుపరం చేస్తే పేదలెవరికైనా వైద్యం అందుతుందా. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తే పేదలకు మెడికల్ సీట్లు, ఉద్యోగావకాశాలు ఎలా వస్తాయి. ప్రభుత్వ నిర్ణయం చూస్తే ధనికులకే మెడికల్ సీట్లు, డాక్టర్లు అవ్వాలన్న తీరు కనిపిస్తుంది. గత ప్రభుత్వం పేదల కోసం పని చేస్తే ఈ ప్రభుత్వం ధనికుల కోసం ఉన్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు. నా కుమార్తె నీట్ రాసింది. ప్రభుత్వ తీరు వల్ల మాలాంటి వారి పిల్లలకు ఉద్యోగావకాశాలు దక్కేలా కనిపించడం లేదు.

– కోవెల జనార్దనరావు, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

ప్రై'వేటు' వేయకండి



మాకవరపాలెం వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి. దీన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వం యోచించడం సమంజసం కాదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా మెడికల్ సీట్లు వస్తాయని ఆశించాం. ఫీజులు తక్కువగా ఉంటాయి. సామాన్యులు సైతం వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కలుగుతుంది. పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తుంది. దీన్ని ప్రైవేటుపరం చేయాలని చూడటం వల్ల వైద్య విద్య సామాన్యులకు మిథ్యే కానుంది. ప్రభుత్వం ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలి.

-వై.గణేష్, ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థి, కశింకోట

చాలా బాధాకరం



ఎంబీబీఎస్ చదవడం ఎంతో మంది కల. రాష్ట్రంలో అరకొరగా ఉన్న మెడికల్ సీట్లతో వైద్య విద్య ఉన్నత వర్గాలకే పరిమితమైంది. మధ్యతరగతి వారికి అందని ద్రాక్షగా మారింది. దీంతో చాలామంది మధ్య తరగతి పిల్లలు వైద్య విద్య కోసం.. ఎన్నో ఇబ్బందుల మధ్య విదేశాలకు వెళ్తున్నారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో సొంత రాష్ట్రంలో ఎంతోమందికి ఎంబీబీఎస్ చదివే అవకాశం వస్తుందని సంతోషపడ్డాం. దీనిని అడ్డుకుని ప్రైవేట్‌పరం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు వార్తలు వింటున్నాం. ఇది చాలా బాధాకరం.

– ఎ.ధనశ్రీ, వైద్య విద్యార్థిని, విశాఖ

కార్పొరేట్ సంస్థలకు మేలు



పేద ప్రజలకు మెరుగైన వైద్యం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో విద్య లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఈ కళాశాలల నిర్మాణం పూర్తయితే అదనంగా 1,800 సీట్లు దక్కుతాయి. ఇప్పటికే ఐదు కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. గత ప్రభుత్వం ప్రతిపాదించి.. నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి వీలులేదు. అందరూ కలసి దీనిపై ఉద్యమించాలి.

– పిల్లా మిత్ర మేఘన, మధురవాడ, విశాఖ

సెజ్‌కు అనువైన భూములు గుర్తించండి



అర్లి ప్రాంతంలో భూములను పరిశీలన చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే బండారు

- ఆర్డీవోకు కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన
- అర్లి ప్రాంతంలో ప్రతిపాదిత భూముల సందర్శన

కె.కోటపాడు : ఆర్లి ప్రాంతంలో స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదిత భూములను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి ఆమె ఆర్లి గ్రామంతో పాటు గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాలకు చెందిన భూములను క్షేత్రస్థాయిలో గుర్తించారు. ఆర్లి ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మూడు గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల డి-పట్టా, గయాలీ, జిరాయితీ భూములు ఉన్నట్టు జిల్లా కలెక్టర్‌కు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ మ్యాప్ ద్వారా వివరించారు. సమీప గ్రామాలకు చెందిన భూములు ఎస్ఈజెడ్‌కు అనువైనదిగా ఉన్నట్టయితే గుర్తించాలని ఆమె ఆర్డీవో చిన్నికృష్ణకు తెలిపారు. ఈ ప్రాంతం పినగాడి వద్ద హైవేకు దగ్గరగా ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఈజెడ్ ఏర్పాటుకు అవసరమైన భూములను రైతుల సంపూర్ణ అంగీకారంతోనే తీసుకునేలా చర్యలను తీసుకుంటామని, బలవంతపు భూ సేకరణ ఉండదని పేర్కొన్నారు. జిరాయితీ, డి-పట్టా, ఆక్రమణదారులకు పరిహారాన్ని అందించేలా చూస్తామన్నారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో అప్పలరాజు, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, నాయకులు పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, సబ్బవరపు రాము నాయుడు, బోళెం బుల్లిదొర, దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

కౌన్ బనేగా వీసీ



- వీసీల నియామకానికి నోటిఫికేషన్
- ఏయూ వీసీ పోస్టు కోసం తీవ్ర పోటీ
- రేసులో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు
- మరో నలుగురు ప్రయత్నాలు
- సామాజిక, రాజకీయ బలం ఉన్న వారికే పదవి

విశాఖ సిటీ : ప్రతిష్ఠాత్మక ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సీటుకు రాజకీయ రంగు పులుముకుంటోంది. నిన్న మొన్నటి వరకు వైస్ చాన్సలర్ నియామకానికి అనుభవం, సమర్థత ప్రామాణికంగా ఉంటే.. ఇప్పుడు సామాజిక వర్గం, రాజకీయ అండదండలే ప్రధాన అర్హతలుగా మారిపోయాయి. తాజాగా యూనివర్సిటీల వీసీ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడింది. దీంతో ఆశావహులు ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావుతో పాటు మరో నలుగురు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

తెరవెనుక పావులు

ఏయూ శతాబ్ది వేడుకలు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పోస్టు కోసం ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అయిదుగురు సీనియర్ ప్రొఫెసర్లు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్రజాప్రతినిధి ద్వారా పావులు కదుపుతున్నట్లు చర్చ జరుగుతోంది.

ఇన్‌చార్జ్ వీసీకి కీలక నేత అండదండలు

పోటీలో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈసీఈ ప్రొఫెసర్‌గా, ఆ విభాగం హెడ్‌గా ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గానే కాకుండా రక్షణ రంగ సంస్థలో పనిచేసిన అనుభవం ఉంది. ఆయన ఇన్‌చార్జ్‌గా వీసీగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఉద్యోగుల సమయ పాలనపై దృష్టి పెట్టారు. ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ఆయనకు టీడీపీతో ఉన్న సత్సంబంధాలు కలిసి వచ్చే అంశంగా కనిపిస్తున్నాయి. అలాగే బీసీ(వెలమ) కావడం కూడా ప్రస్తుత పోటీలో కీలకం కానుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈయన ఏయూ పాలక మండలి సభ్యుడిగా మూడేళ్ల పాటు పనిచేశారు. తాజాగా అనకాపల్లి జిల్లాలో అదే సామాజిక వర్గానికి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం.

మద్దతు కూడగడుతున్న ఉమామహేశ్వరరావు

గతంలో రిజిస్ట్రార్‌గా చేసిన ఉమామహేశ్వరరావు కూడా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈయన మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం లయన్స్ కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అందరిని కలుపుకొని వెళతారన్న గుర్తింపు ఉంది. ఉమామహేశ్వరరావు ఓసీ (కమ్మ) కావడం ప్రధాన బలం. అయితే ఇప్పటికే రిజిస్ట్రార్‌గా అదే సామాజిక వర్గానికి చెందిన ధనుంజయరావును నియమించారు. మళ్లీ వీసీగా అదే వర్గానికి చెందిన ఉమామహేశ్వరరావుకు ఎలా ఇస్తారన్న ప్రశ్నను అతని ప్రత్యర్థి వర్గం వారు తెరపైకి తీసుకువస్తున్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ ధనుంజయరావు కూడా పోటీలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఒక ఎంపీ మద్దతుతో ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏయూలో చర్చ జరుగుతోంది.

వర్గాల వారీగా విడిపోయి

లక్షల మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆంధ్రా యూనివర్సిటీలో ఇటీవల కాలంలో కులాల కంపు కొడుతోంది. ఏ పదవి, ఉద్యోగం, తాత్కాలిక నియామకం.. ఇలా దేనికైనా అదే గీటురాయిగా మారిపోయింది. విద్యార్థి సంఘాలతో పాటు కొంత మంది ప్రొఫెసర్లు కూడా సామాజికవర్గాల వారీగా విడిపోయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీసీ పోస్టు కోసం పోటీ పడుతున్న వారిలో ఒక్కొక్కరి వెనుక ఒక్కో వర్గం పావులు కదుపుతున్నట్లు వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావుకు వ్యతిరేకంగా ఒక వర్గం పనిచేస్తున్నట్లు సమాచారం. ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి కొందరు శశిభూషణరావుకు వీసీ పోస్టు రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏయూలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆస్పత్రిపై విముఖత ఎందుకు!

- గిరిజనుల్లో చైతన్యం రావాలి
- తహసీల్దార్ చొరవతో గర్భిణికి ముందస్తు వైద్యసేవలు



లోసింగికి చెందిన గర్భిణి చిన్నాకి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీత

రోలుగుంట : మండలంలో గిరిజన గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు విస్తృతపరుస్తున్నామని, వైద్య సహాయం పొందే విషయంలో వారిలో చైతన్యం రావాలని తహసీల్దార్ కె.వరహాలు కోరారు. గిరిజన పంచాయతీ అర్ల గ్రామ శివారు లోసింగి ప్రాంతానికి చెందిన గర్భిణి మర్రి చిన్నాకి వైద్య సేవలందించేందుకు ఆయన ముందస్తు చర్యలు చేపట్టారు. రక్తహీనత సమస్య ఉన్న ఆమెకు బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యురాలు సునీత ఈ నెల 30న డెలివరీ డేటు ఇచ్చారు. రక్తహీనత తొలగేందుకు ఆమెకు ఇప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స అందిస్తే సుఖప్రసవం అవుతుందని వైద్యురాలు పై అధికారులకు సూచించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఈ నెల 4న ఆమెను లోసింగి నుంచి బుచ్చింపేట పీహెచ్‌సీకి తరలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. అయితే గర్భిణికి రక్తహీనత ఉన్నందున సుఖప్రసవం కోసం రక్తం అవసరం అవుతుందని, అందువల్ల ఇన్ పేషెంటుగా ఆస్పత్రిలో పేరు నమోదు చేసుకొని వైద్యం పొందాలని ఆమెకు సూచించారు. అయితే ఆ రోజు వైద్యం పొందిన గర్భిణి వైద్యాధికారి సూచన పట్టించుకోకుండా తిరిగి అదే రోజు లోసింగి వెళ్లిపోయింది. దీంతో తహసీల్దార్ వరహాలు మరో ప్రయత్నంగా ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వో శ్రీనివాసరావుని గురువారం లోసింగి పంపించి ఆమెను బుచ్చింపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం గర్భిణి చిన్నాని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తామని, ఆమెకు సహాయంగా వచ్చే వారికి కూడా ఆమె ప్రసవించే వరకూ వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. గర్భిణి చిన్నా తాను ఆస్పత్రిలో ఉండలేనని, గ్రామానికి వెళ్లిపోతానని అనడం బాధాకరమన్నారు. సుఖప్రసవం, తల్లీబిడ్డ క్షేమం కోసం తాము చేపట్టిన ముందస్తు వైద్య సేవలు కొనసాగించేందుకు ఆమె కుటుంబీకులు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

కదం తొక్కిన స్టాఫ్ నర్సులు



ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

నర్సీపట్నం: రెగ్యులరైజేషన్ చేయాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు గురువారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. ముందుగా నల్లబ్యాడ్జీలు ధరించి స్టాఫ్‌నర్సులు స్థానిక ఏరియా ఆస్పత్రి గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో హెచ్.వి.జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 ఏళ్లుగా పని చేస్తున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 115 రద్దు చేయాలని, లేనిపక్షంలో సేవలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఏరియా ఆస్పత్రి, పరిసర ప్రాంతాల్లోని స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దేరుకు తగ్గిన వరద పోటు



మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయానికి వరద పోటు తగ్గింది. ఇక్కడ 1,350 క్యూసెక్కులున్న ఇన్ ఫ్లో గురువారం నాటికి 450 క్యూసెక్కులుకు తగ్గడంతో జలాశయం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జలాశయం నుంచి 70 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా, పంట కాలువలకు 120 క్యూసెక్కులు సాగు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ఖరీఫ్ వరి చేలుకు ఢోకా లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి(వయా దువ్వాడ మీదుగా) వీక్లీ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్(07442) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.57 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబర్ ఆరు నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07443) వీక్లీ స్పెషల్ ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 6.02 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతి వెళ్తుంది. ఈస్పెషల్ అక్టోబర్ 7 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు నడుస్తుంది.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై రివ్యూకు సుప్రీం ఆమోదం

- గ్లోబల్‌మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య

సీతంపేట: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై విశాఖపట్నానికి చెందిన డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ వేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆమోదించిన నేపథ్యంలో తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని, న్యాయపరంగా అన్ని విషయాలు సమగ్రంగా పరిశీలించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోర్టుకు విన్నవించామని తెలిపారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు రద్దుచేసే వరకు పోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు.

ముంపు పంటకు నష్టమే..

- 5 రోజులు దాటితే జాగ్రత్త పడాలి
- జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంట మునక
- నీటిని తొలగించి కాపాడుకోవాలి
- క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి
- ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల సూచన

ఇంకా వరద ముంపులోనే పంట ఉంటే రైతులు జాగ్రత్త పడాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఐదు రోజులకుపైగా పొలాల్లో నీరు ఉంటే తెగుళ్లు బారిన పడి పంట కుళ్లిపోతుంది. వెంటనే నీరు బయటకు మళ్లించాలి. ఆపై వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంట సంరక్షణ చర్యలు చేపట్టాలి.



సాక్షి, అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు 7 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, చెరకు, అపరాలు, పత్తి, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. వీటిలో 6 వేల ఎకరాల్లో వరి నీటి మునిగింది. వరినాట్లు వేసి 20 నుంచి 40 రోజులే అయింది. ఈ దశలో ఐదు రోజులు దాటి పంట మునిగి ఉంటే తీవ్ర నష్టం ఏర్పడుతుందని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. వరిలో ఎంటీయూ 1318 రకం అయితే 5 నుంచి 6 రోజులు, ఎంటీయూ 1061 రకం 6 నుంచి 7 రోజులు, బీపీటీ 5204 రకం 3–4 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. ముంపునకు ముందు ఎరువులు వేస్తే మాత్రం, అటువంటి పొలాల్లో ఎక్కువగా నష్టం కలుగుతోంది. ఆర్జీఎల్, స్వర్ణ, కర్నూల్ సోనా వంటి రకాల్లో మూడు నుంచి నాలుగు రోజులు దాటితే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఆర్ఏఆర్ఎస్ రిసెర్చ్ అసోసియేటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.కె జగన్నాథరావు, ఇతర శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ వి.గౌరి, డాక్టరు చంద్రశేఖర్, డాక్టరు అలివేణి రైతులకు పలు సూచనలు చేశారు. నీట మునిగిన పంటను ఏ విధంగా కాపాడుకోవాలనే దానిపై మరికొందరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు నేరుగా పొల్లాలోకి వెళ్లి సూచనలు చేస్తున్నారు.

పంట కాపాడుకోవాలి ఇలా...

ముంపునకు గురైన వరి పంటలో పాత నీరు లేకుండా గండి కొట్టి తీసేయాలి. వెంటనే మ్యూరెట్ ఆఫ్ పొటాషియం, యూరియా కలిసి వేయాలి. వరి పైరు నాటిన వెంటనే లేదా పిలకల దశలో అయితే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. తెగుళ్ల వ్యాప్తి చెందకుండా 2 గ్రాముల కార్బెండజింతో పాటు మాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- అదే చెరకులో అయితే ఎక్కువగా నిల్వ నీటిని వీలైనంత త్వరగా బయటకు తీసి.. పాక్షికంగా పడిన తోటలను నిలగట్టాలి. ముంపునకు గురైన తోటలలో నీరు తగ్గిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్‌ను మొక్కల మొదళ్ల వద్ద గుంతలలో వేయాలి. మువ్వు కుళ్లు ఆశించిన తోటలలో ఒక గ్రాము కార్బెండజిం లేదా 3 గ్రాము మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగులు సోకిన తోటలలో నుంచి నీటిని ఆరోగ్యకరమైన తోటలకు పారకుండా చూడాలి.
- మొక్కజొన్న పంటలో ఎట్టి పరిస్థితుల్లోనూ 48 గంటల్లో పొలంలో నిలిచిపోయిన నీటిని తీసి వేసిన తర్వాత, పంటకు 2 శాతం యూరియా లేదా ఒక శాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది.
- అపరాలలో నిలిచిపోయిన నీటిని తీసివేసి.. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా హెక్సాకొనజోల్‌ను 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కంది పంటలో ఇనుము లోపం వచ్చే అవకాశం ఉన్నందున లోపాన్ని సరిచేయడానికి ఫెర్రస్ సల్ఫేట్‌ను 5.0 గ్రాములు + సిట్రిక్ యాసిడ్‌ను 0.5 గ్రామును కలిపి పిచికారీ చేయాలి. ఎక్కువగా ముంపునకు గురైన కంది పొలాల్లో నీరు తగ్గిన వెంటనే 20 కిలోల యూరియా ఎకరానికి బూస్టర్ మోతాదులో వేసుకోవాలి.
- పత్తి పంటలో నీటిని తీసివేసి.. ఎండగా ఉన్న సమయంలో మాత్రమే 1–2 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- కాయగూరల పంట పొలంలో నీరు నిలిచినట్లయితే వేరు కుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. నిలిచిన నీటిని వెంటనే బయటకి తీసి.. 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్నారని కొనియాడారు. పి.సుందరయ్య, ఇ.ఎం.ఎస్, బి.టి.ఆర్, బసవ పున్నయ్య, జ్యోతిబసు వంటి సీనియర్ ప్రముఖులతో కలిసి పని చేశారన్నారు. విశాఖ జిల్లాలో పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యసభలో గళమెత్తడమే కాకుండా వాటిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగేందుకు విశేష కృషి చేశారన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారన్నారు. వామపక్ష పార్టీలకు, భారత రాజకీయాలకు మార్గదర్శకంగా వ్యవహరించారన్నారు. దేశం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం లేకపోవడం దేశానికి, పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు

గాజువాక : గణపతి మహోత్సవాల సందర్భంగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఓపెన్ పురుషులు, మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పి.కోటేశ్వరరావు తెలిపారు. విశాఖలోని సాలాపువానిపాలెంలో నిర్వహించనున్న ఈ పోటీలు 19న పురుషుల విభాగంలోను, 20, 21వ తేదీల్లో మహిళా విభాగంలోను నిర్వహిస్తామన్నారు. విజేతలకు పురుషులు, మహిళా విభాగాల్లో మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు, నాలుగవ బహుమతిగా రూ.10వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు 7680005666, 9885698717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరద బాధితులకు రూ.2 లక్షల సాయం



భీమునిపట్నం: రాష్ట్రంలో వరద బాధితులకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.వి.ఎల్.కామేశ్వరావు గురువారం రూ.రెండు లక్షల సాయం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి తన వంతు విరాళంగా ఈ మొత్తం అందించారు. కోవిడ్ సమయంలో కూడా ఆయన రూ.లక్ష సాయం చేశారు.

నర్సీపట్నంలోనే బాక్సింగ్ రింగ్ నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: బాక్సింగ్ రింగ్‌ను నర్సీపట్నంలోనే నిర్మించాలని కలెక్టర్‌ను కోరినట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. వీరు శిక్షణ పొందేందుకు తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో కలెక్టర్‌తో మాట్లాడి బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ మంజూరు చేయించానని పేర్కొన్నారు. నిర్మాణానికి అప్పటి కలెక్టర్ రూ.55.39 లక్షలు మంజూరు చేశారన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అభ్యర్థన మేరకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో స్కేటింగ్ రింగ్ ఆవరణలో బాక్సింగ్ రింగ్ నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. 2024 జనవరిలో టెండర్ జారీ చేసి పనులు కూడా సంబంధిత కాంట్రాక్టర్ మొదలు పెట్టారన్నారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో బాక్సింగ్ రింగ్ నిర్మాణంపై అభ్యంతరం తెలపడంతో క్రీడాభివృద్ధి ప్రాజెక్టు వారు ఈ నిధులను వేరే నియోజకవర్గానికి కేటాయిస్తున్నట్లు తెలిసిందన్నారు. స్కేటింగ్ రింగ్‌లో కాకుంటే నర్సీపట్నంలోనే వేరే చోట నిర్మించాలని కలెక్టర్‌ను లిఖిత పూర్వకంగా కోరామన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో క్రీడాకారులను దృష్టిలో పెట్టుకుని బాక్సింగ్ రింగ్ ఇక్కడే నిర్మిస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. లేని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

కలెక్టర్ పర్యటనపై సమాచారం ఏదీ?

- ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్య తీసుకోవాలి
- ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ అనురాధ డిమాండ్

కె.కోటపాడు : ఆర్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పర్యటించిన అధికారిక కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీలుగా ఉన్న తమకు అధికారులు కనీసం సమాచారం ఇవ్వకపోవడం శోచనీయమని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. ప్రభుత్వ అధికారిక పర్యటన సమయాల్లో సమాచారాన్ని ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు కావాలనే తమకు సమాచారంను ఇవ్వలేదని వీరు గురువారం విలేఖరులకు తెలిపారు. మండలానికి ఎంపీపీగా ఉండడంతో పాటు జిల్లా కలెక్టర్ పర్యటించిన ఆర్లి ప్రాంతానికి ఎంపీటీసీ సభ్యుడైన తనకు సమాచారం ఇవ్వకపోవడం సమంజసం కాదని ఎంపీపీ జగన్‌మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన మరో అధికారిక కార్యక్రమం పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని ఆహ్వానించిన ప్రాజెక్ట్ అధికారిని మంగతాయారు ఎంపీపీగా తనకు కనీస సమాచారంతో పాటు ఆహ్వానాన్ని ఇవ్వలేదని జగన్‌మోహన్, జెడ్పీటీసీతో పాటు జిల్లా పరిషత్ స్త్రీశిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా తనకు కార్యక్రమంపై సమాచారం ఇవ్వలేదని ఈర్లె అనురాధ అన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సమాచారం ఇవ్వని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ అనురాధ కోరారు.

అరసం జిల్లా అధ్యక్షుడిగా జీఎల్ఎన్ శాస్త్రి



కవితా స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి ప్రసాద్, జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

అనకాపల్లి: జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడిగా జి.ఎల్.ఎన్.శాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి స్థానిక శేఖవీధి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షుడిగా గెల్లా జయబాబు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి ప్రసాద్, జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షులను మాత్రమే ఎన్నుకున్నారన్నారు.

మరో పది రోజుల్లో మిగిలిన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా జిల్లా సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంతోమంది కవులకు, కళాకారులకు జిల్లా నిలయమన్నారు. అనంతరం రచయిత గరిమెళ్ల సత్యనారాయణ రచించిన 'కవితా స్రవంతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి జి.ఎస్.చలం, జిల్లా తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు కె.రామమోహనరావు, అరసం ప్రోగ్రాం చైర్మన్ బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం బైక్ యాత్ర



బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి: జిల్లాలో ఫార్మా, సెజ్ కంపెనీల్లో కార్మికులకు భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పాయకరావుపేట నుంచి అచ్యుతాపురం వరకు 300 కిలోమీటర్ల మేర బైక్ యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో బైక్ యాత్ర పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో గత నెల 21న అచ్యుతాపురం వద్ద ''ఎసైన్షియా ఫార్మా'' ప్రమాదం అతి పెద్దదన్నారు. రాష్ట్రంలో వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే, అనకాపల్లి జిల్లాలో ఆరేళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది మృతి చెందగా, 92 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. లెక్కకు రాని మరెన్నో ఘటనలు ఉన్నాయన్నారు. ఎస్ఈజెడ్‌ల్లో కంపెనీలు భూమి, నీరు, కరెంట్ వంటి అనేక మౌలిక వసతులు, రుణాలు వంటి రాయితీలు ప్రభుత్వాల నుంచి ప్రజల సొమ్ముతో పొందుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఫ్యాక్టరీలను తనిఖీలు చేయకుండా అధికారులపై ఆంక్షలు విధించడంతో ప్రమాదాలు మరింత పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

2016లో కేంద్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత తనిఖీల విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం జి.వో 62 తీసుకొచ్చి రెగ్యులర్ తనిఖీలను అటకెక్కించినట్లు ఆరోపించారు. జి.వోను వెంటనే రద్దు చేయాలన్నారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, లేబర్ డిపార్టుమెంట్, ఫైర్, బాయిలర్ చెకింగ్ వ్యవస్థలు మొద్దునిద్రలో ఉన్నాయన్నారు. అనేక కంపెనీలలో భద్రతా ప్రమాణాలపై యాజమాన్యాలు ఖర్చు తగ్గించుకోవడానికి నాసిరకం, కాలం చెల్లిన పరికరాలు, రియాక్టర్లు, పైపులు వాడడం, భవన నిర్మాణంలో డిజైన్ల లోపాలు వంటివి అనేక నివేదికల్లో బయటపడ్డాయని ఆరోపించారు. అర్హత, నైపుణ్యం కలిగిన కార్మికులతో పనులు చేయించకుండా తక్కువ జీతాలతో వలస కార్మికులతో చేయించడం వంటి లోపాలే ప్రమాదాలు పెరగడానికి ఒక కారణమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG B.Tech., Diploma, D & B-ఫార్మసీ, B.Ed, B.P.Ed,MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339 [HA-15202]

Services

ASTROLOGY

■ శ్రీసాయి బాలాజీ జ్యోతిష్య కేంద్రం. పండిట్ శ్రీరామ్ భట్, భేతాల చాడేశ్వరి కేరళ భగవతి ఆరాధన విద్య, ఉద్యోగం, దాంపత్య సమస్యలు, వ్యాపారంలో లాభనష్టాలు, స్త్రీ, పురుషుల ప్రేమ వివాహం మరియు ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కారం చూపబడును. MVP కాలనీ, వైజాగ్. Ph: 9963426406 [HA-609]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

Wanted

■ High Potential Corporate Sector Requires Follwing posts for VSP Region. (1) Chief Managers (M) - 2 Posts. Yearly Package : 12 Lakhs P.A. Qul : Retd. Gazetted Officers from State / Central. (2) Managers (Trainee) M/F - 8 Posts. Yearly Package : 6 Lakhs P.A. Qul : 10 Years any Job Exp. Interview on 13 & 14 Sep. @ Company Regional Officer. Cont : Ranga Prasad. ✆ : 63050 90508 [V- 3204]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 7702473949 [G-9034]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

కానరాని గల్లంతైన మహిళ జాడ

- పెద్దేరులో గజ ఈతగాళ్లతో గాలింపు



పెద్దేరు నది వద్ద కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వరరావు

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది వద్ద పెద్దేరు నదిలో గల్లంతైన జనపరెడ్డి సుబ్బలక్ష్మి ఆచూకీ రెండో రోజు లభించలేదు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సుబ్బలక్ష్మి తన అక్క బుద్ది విజయలక్ష్మితో కలిసి పెద్దేరు వద్దకు బహిర్భూమికి వెళ్లింది. కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సుబ్బలక్ష్మి పెద్దేరులో పడిపోయింది. రాత్రంతా గాలించినా ఆమె ఆచూకీ కనిపించలేదు. మృతురాలి అక్క ఫిర్యాదుతో బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు కేసు నమోదు చేసి బుధవారం నుంచి పెద్దేరు నదిలో గాలిస్తున్నారు. గురువారం కొత్తకోట సీఐ కోటేశ్వరరావు నదిని పరిశీలించారు. సంఘటన గురించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గజ ఈతగాళ్లతో వెతికించగా, వడ్డాది సంతబయిలు వద్ద సుబ్బలక్ష్మి చీర కనిపించింది. దీంతో ఆమె మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా 5కె రెడ్ రన్ మారథాన్



బాల, బాలికల విభాగంలో రూ.7 వేల చెక్కు అందజేస్తున్న బాలాజీ



5కె రన్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వ్యాధి సోకిన రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నామని డీఎంహెచ్‌వో ఎం.ఎస్.వి.కె. బాలాజీ తెలిపారు. 5కె రెడ్ రన్ మారథాన్‌ను గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యూత్‌ఫెస్ట్-2024–25లో భాగంగా ఏపీ ఎయిడ్స్ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పూడిమడక జాతీయ రహదారి నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకు విద్యార్థులతో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలల్లో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 5కె రెడ్ రన్ పోటీల్లో గెలిపొందిన బాలుర విభాగంలో రామానాయుడు, రామతేజ, బాలికల విభాగంలో దివ్యదుర్గ, నాగమణిలకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.7 వేలు, రూ.3 వేలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, సంస్థ క్లస్టర్ మేనేజర్ రామచందర్, సీఎస్‌వో డాక్టర్ స్పందన, ఏసీడీసీ కౌన్సిలర్ రవి, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ ధీరుడు ఏచూరి

- వామపక్ష నేతల నివాళి
- విశాఖతో విడదీయలేని అనుబంధం
- ఇక్కడే జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



గత ఏడాది అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

గాజువాక /డాబాగార్డెన్స్: కమ్యూనిస్టు మేధావి, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విశాఖతో మర్చిపోలేని అనుబంధం కలిగి ఉన్నారు. కాకినాడ ప్రాంత వాసి అయిన ఆయన మద్రాసులో చదువు ప్రారంభించి ఢిల్లీలో స్థిరపడ్డారు. విద్యార్థి దశలో రాజకీయ ప్రస్థానం ప్రారంభమై అఖిల భారత స్థాయిలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన ఆ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా విశాఖ నుంచే ఎన్నికయ్యారు. 2015 ఏప్రిల్ 14 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని పోర్టు స్టేడియంలో నిర్వహించిన సీపీఎం 21వ జాతీయ మహాసభల్లో ఆయన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, విశాఖతో ఆయన తొలి నుంచీ మంచి ఉద్యమ సంబంధాలను కలిగి ఉన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, పార్లమెంటరీ కమిటీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో షిప్‌యార్డ్‌ను రక్షణ రంగంలోను, బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్‌లో విలీనం చేయడానికి తీవ్రంగా కృషి చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ముందుకు సాగేందుకు తగిన సూచనలు ఇవ్వడమే గాక, దేశ వ్యాప్తంగా స్టీల్ ఉద్యమానికి మద్దతు కూడగట్టారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయమై సీపీఎం గతేడాది గత ఏడాది అక్టోబర్ 5న ఉత్తరాంధ్ర జిల్లాలో చేపట్టిన బైక్‌యాత్ర, అనంతరం స్టీల్‌ప్లాంట్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీతారాం ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ విధంగా విశాఖతోను, విశాఖలోని ప్రజా ఉద్యమాలు, కార్మిక పోరాటాలతోను ఆయన విడదీయలేని బంధాన్ని ఏర్పరచుకున్నారు. దరిమిలా ఆయన మృతి వార్త ఈ ప్రాంత ఉద్యమకారులను, వామపక్షవాదులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

సీతారాం మృతి తీరని లోటు

సీతారాం ఏచూరి మృతి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటని సంతాప సభలో పలువురు వక్తలు కొనియాడారు. ఏచూరి మరణ వార్త తెలిసిన వెంటనే సీపీఎం విశాఖ జిల్లా కమిటీ గురువారం సాయంత్రం సీపీఎం జిల్లా కార్యాలయంలో సంతాప సభ నిర్వహించింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీనియర్ నాయకులు ఎ.అజశర్మ, ఎస్.సుధాకర్, కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్‌లు సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, రాజు, నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు పీతల అప్పారావు, పి.వి.రమణ, జి.పోలేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సుమారు రూ.60,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జేకే మీనా వారి సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో కోరాపుట్‌కు చెందిన షాను ఖాడా, మంగరాజ్ ఖడాలు 12.1కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించగా జీఆర్పి సిబ్బంది రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

పోలీస్ కస్టడీ నుంచి నిందితుడి పరారీ

- పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఘటన
- నిందితుడు దొంగతనాలలో ఘనాపాటి

పీఎం పాలెం: పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడు పరారైన ఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండెయపాలేనికి చెందిన ఎర్రింటి కృష్ణబాబు అలియాస్ గంగడు(22) చిన్న వయసు నుంచి దొంగతనాలకు అలవాటుపడ్డాడు. అతని ఆగడాలు సహించలేక కుటుంబ సభ్యులు దూరంపెట్టారు. ఏకాకిగా ఉంటూ అవకాశం చిక్కినప్పుడల్లా దొంగతనాలు చేస్తూ విలాసాలు చేస్తుండేవాడు. నాలుగు కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. రెండు రోజుల క్రితం ఎండాడ కూడలి వద్ద స్థానిక క్రైం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. గతంలో 10 ఇళ్లల్లో జరిగిన దొంగతనాల్లో కృష్ణబాబు ప్రమేయంపై పీఎం పాలెం స్టేషన్‌లో క్రైమ్ సీఐ ప్రకాష్ విచారణ జరిపారు. విచారణ సమయంలో నిందితుడి వద్ద గంజాయి పొట్లాలను గుర్తించారు. గంజాయికి సంబంధించిన కేసుల్ని విచారిస్తున్న లా అండ్ ఆర్డర్ విభాగానికి బుధవారం ఉదయం 10 గంటలకు తరలించారు.

మధ్యాహ్నం 2 గంటల సమయంలో కృష్ణబాబు తన చేతికి వేసిన బేడీలను విడిపించుకుని, అదను చూసి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు విషయాన్ని ఉన్నతాధికారుకు తెలియజేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. నిందితుడి పరారీకి దారి తీసిన పరిస్థితులపై ఇన్‌చార్జి ఏసీపీ పెంటారావు గురువారం విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

వేడుకగా వేంకటేశ్వరస్వామి కల్యాణ వ్రతం



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతబయలు పెదరామస్వామి కల్యాణ మండపంలో ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణ వ్రత మహోత్సవం జరిగింది. పట్టణ, మండలంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్ని కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ ప్రజలు అందరూ ఆరోగ్యంగా జీవించాలని, ప్రశాంతమైన జీవితం గడపాలంటే దైవభక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో మళ్ల సురేంద్ర, బ్రహ్మకుమారీలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం

కశింకోట: జి. భీమవరంలో మరిడిమాంబ ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకుని అరటి గెలలు, చీరలు, రవికెలు తదితర రూపాల్లో సమర్పించి పూజలు చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా నాయకుడు దాడి రత్నాకర్ తదితరులు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ తరపున పూలమాలలు వేసి కండువాలు కప్పి ఘనంగా సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జనసేన ప్రతినిధి కర్రి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఉల్లి ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో ఉల్లి ధర తగ్గింది. గత వారం కిలో రూ.60 ఉండగా, ఈ వారం రూ.50కి విక్రయాలు సాగాయి. నాసి రకం ఉల్లి రూ.40కి అమ్మకాలు చేశారు. ఎప్పటి లాగే టమాటా, బంగాళదుంప, వంకాయ, బెండకాయ రూ.40, బీట్‌రూట్, క్యారెట్, చేమ దుంప, చిక్కుడు, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.80, ఆగాకర కాయలు రూ.150కి విక్రయాలు సాగాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగలు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ కె.రాజశేఖర్, ఏడీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాం. దీనగరం, సాయినగర్, లక్ష్మీదేవిపేట, మిరియాల కాలనీ, పాత్రుడు కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 143 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,610	4,610
రెండో రకం	3,500	4,530
మూడోరకం	3,200	3,460

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 362 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

శుద్ధ నీరు.. సురక్షితమేనా...!

- వాటర్ ప్లాంట్స్‌పై పర్యవేక్షణ శూన్యం
- పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న వైనం
- అనకాపల్లిలో అనధికారకంగా నిర్వహణ
- బోరు నీరు నింపి విక్రయాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం



వేల్పులవీధిలో ఆర్వో వాటర్ ప్లాంట్

అనకాపల్లి: పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవడం తోనే ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలకు కూడా సురక్షితమైన తాగునీరుకు ప్రాధాన్యమిస్తున్నారు. పంచాయతీ, జీవీఎంసీ సరఫరా చేసే నీరు తాగడానికి ఆమోద యోగ్యంగా లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో శుద్ధినీటిపై ప్రజలు ఆధారపడుతున్నారు. దీన్ని అవకాశంగా చేసుకుని ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్లాంట్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. సరైన ప్రమాణాలు పాటించకుండా వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఒకప్పుడు మినరల్ వాటర్ తాగడం అనేది కొంతమందికి స్టేటస్ సింబల్‌గా ఉండేది. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ అటువంటి నీటినే నిత్యం వాడాల్సి వస్తోంది. గతంలో రూపాయికి వ్యాటర్ ప్యాకెట్ దొరికేది. ఇప్పుడు రూ.10లకు 20 లీటర్ల క్యాన్‌తోపాటు 250 ఎంఎల్, 500 ఎంఎల్ లీటర్ బాటిళ్లను విక్రయిస్తున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌లోనే కాకుండా కిరాణా దుకాణాలు, ఎక్కడికెళ్లినా వివిధ పేర్లతో తాగునీరు విక్రయాలు పెరిగిపోయాయి. ఈ విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ, పంచాయతీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుడడం విమర్శలకు తావిస్తోంది.

ఐదు వాటర్ ప్లాంట్లకే పర్మిషన్...

పట్టణ పరిధిలో ఐదు వాటర్ ప్లాంట్లకు మాత్రమే పర్మిషన్ ఇవ్వగా, అందులో వేల్పులవీధిలో జీవీఎంసీ వాటర్ ప్లాంట్ ద్వారా తక్కువ ధరకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇవే కాకుండా అనధికారికంగా 80కిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. రోగాలు అధికంగా ప్రబలే వర్షాకాలంలో తాగునీటిని నాణ్యతతో సరఫరా చేయడానికి ఎక్కడికక్కడ శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాల్సి ఉంటుంది. పట్టణ, మండలంలో ఎక్కడా అటువంటి దాఖలాలు కనిపించలేదు.

కలుషిత నీటితోనే...

వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు కలుషిత భూగర్భ జలాలనే నామమాత్రంగా శుద్ధి చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ నీళ్లకు అలవాటు పడిన ప్రతి ఒక్కరూ మినరల్ వాటర్ తాగుతున్నామన్న భావనలో ఉన్నారు. క్రమేణా శరీరంలో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు ఈ నీటి వల్లేనని మాత్రం గ్రహించలేకపోతున్నారు. కీళ్ల, మోకాళ్ల నొప్పులు నుంచి జీర్ణ ప్రక్రియ సమస్య డయేరియా, జలుబు, దగ్గు, ఇతర దీర్ఘకాలిక సమస్యలు, విషతుల్య కారకాలు శరీరంలో పేరుకుపోవడం వంటి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్లాంట్ నిర్వహించాలంటే...

వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలంటే ముందుగా భూగర్భ జలాలను వాణిజ్య అవసరాలకు వినియోగించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు తహసీల్దార్, జీవీఎంసీ అధికారులు జోనల్ కమిషనర్ నుంచి అనుమతులు తీసుకోవాలి. చాలా వరకూ వాటర్ ప్లాంట్లు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వాటర్ ప్యాకింగ్ విషయానికి వస్తే బాటిల్‌పై బ్రాండ్ పేరు తప్ప బ్యాచ్ నంబర్, కోడ్, ప్రాసెసింగ్ తేదీలు కనిపించవు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్, పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ట్రేడ్ లైసెన్స్, కొన్ని రకాలైన సర్టిఫికెట్లు తీసుకున్న తర్వాత మాత్రమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. వీటికి విరుద్ధంగా ఎక్కడి పడితే అక్కడ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

- ఫ్లొరైడ్..ఉప్పు నీటి నుంచి ఉపశమనం కోసం ప్రజలు శుద్ధనీటి వైపు మళ్లారు.
- స్థానిక సంస్థల ద్వారా సరఫరా అయ్యే నీటిని రోజువారీ అవసరాలకు వినియోగిస్తున్నారు.
- అత్యధిక శాతం మంది శుద్ధి నీటిపైనే ఆధారపడుతున్నారు.
- ఫిల్టర్ చేసిన నీరు రుచికరంగా అనిపిస్తుండటంతో ఎక్కువ మంది వాటినే తాగుతున్నారు.
- పట్టణ ప్రాంతాల వరకు ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్(శుద్ధ జలం) ప్లాంట్లు గ్రామాలకూ విస్తరించాయి.
- మినరల్ వాటర్ అని పైకి చెప్పినా జనరల్ వాటర్‌నే పైపైన ఫిల్టర్ చేసి ప్రజలకు విక్రయిస్తున్నారు.
- ఐఎస్ఐ ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు.
- అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అనుమతి లేకపోతే చర్యలు

ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు సమయంలో నిర్వాహకులు సంబంధిత శాఖాధికారులు అనుమతి తీసుకోవాలి. ఇటీవల పట్టణ పరిధిలో రింగ్‌రోడ్డుతోపాటు మండలంలో శంకరం, రేబాక గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను పరిశీలించాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాంట్‌ను సీజ్ చేశాం. అనధికారకంగా ఎక్కడైన ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లయితే చర్యలు తీసుకుంటాం.

– వై.శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్, అనకాపల్లి

పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలి....

వాతావరణంలో మార్పులు కారణంగా తాగునీరు పూర్తిగా కలుషితమైపోయింది. శరీరంలో అన్ని అవయవాలకు రక్తంతోపాటు నీరు ఎంతో అవసరం. శరీరంలో తాగిన నీరు లేకపోయినట్లయితే వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఉదయం లేచిన వెంటనే, రాత్రి పడుకునే సమయంలో గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఆరోగ్యంగా జీవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఫిల్టర్ వాటర్‌పై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలి.

– డీడీ నాయుడు, వైద్యుడు, అనకాపల్లి

కూటమి పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం నాలుగు నెలల వ్యవధిలో రూ.43 వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల హామీలను సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. నేటికి 43 వేల కోట్లను ఎఫ్ఆర్ఎంబీకి లోబడి అప్పులు చేసిందన్నారు. ప్రతీ మంగళవారం అప్పులకు పరిగెడుతూ ఏపీని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చి పాలన సాగిస్తున్నారన్నారు. ఇన్ని అప్పులు చేసిన చంద్రబాబు ప్రజలకు ఏమైనా మంచి చేశారా అని ప్రశ్నించారు. విద్య, వైద్య ఆరోగ్య వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అనేవి ఒక్కటి చేయకుండా గాలికొదిలేసి, మరి తెచ్చిన అప్పు ఏమి చేశారో అర్థం కావడం లేదన్నారు. సీఎం చంద్రబాబు అధికారం చేపడితే రాష్ట్రంలో సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు అప్పుల ఆంధ్రప్రదేశ్ చేస్తున్నారని, భవిషత్‌ల్లో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభంలో పడే అవకాశాలు ఉన్నాయని జోష్యం చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి మాజీ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి మంచి సంక్షేమం అందిస్తానని ఎలా చెప్పారో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



కశింకోటలో వ్యాన్‌పై ఊరేగిస్తున్న వినాయకుడు

కశింకోట: పెద్ద వినాయక నిమజ్జనాలు మొదలయ్యాయి. స్థానిక దాణా పరిశ్రమ వద్ద వినాయక చతుర్థి ఉత్సవాలు పురస్కరించుకుని నెలకొల్పిన పెద్ద వినాయక విగ్రహాన్ని పరిశ్రమ నుంచి వ్యాన్‌పై నిలిపి యువకులు, కార్మికుల నృత్యాలు, డప్పులు, వాయిద్యాలతో జాతీయ రహదారి, సంతబయల, గవరపేట మీదుగా ఊరేగింపు నిర్వహించారు. పెద్ద గుమ్మం వద్ద శారదానదిలో సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు దారి పొడువునా వినాయకుని దర్శించుకుని పూజలు చేశారు.

గిరిజన సంక్షేమానికి కేంద్ర సహకారం



చినకూర్మనాథపురంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సద్వినియోగపర్చుకోవాలని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం తాటిపర్తి పంచాయతీ శివారు చినకూర్మానాథపురం, కాశీపురం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో 22 పథకాలు గిరిజన సంక్షేమానికి అమలు చేస్తుందన్నారు. సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

26న దుర్గమాంబ ఉత్సవం

కశింకోట: గవరపేటలో దుర్గమాంబ ఉత్సవాన్ని నిర్వహించడానికి గురువారం చాటింపు వేశారు. ఈ నెల 19న అమ్మవారి పుట్టుక ఉత్సవం, 26న పండగను నిర్వహించడానికి నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సంప్రదాయంగా వారం ముందుగా గ్రామంలో చాటింపు వేసినట్లు చెప్పారు.

ఈ క్రాప్ రైతుల ఈకేవైసీ తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



అమృతపురంలోని రైతు సేవాకేంద్రంలో ఈకెవైసీని పరిశీలిస్తున్న మోహన్‌రావు

సబ్బవరం: ఈ క్రాప్ పూర్తిచేసుకున్న రైతులంతా ఈకేవైసీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని అమృతపురం గ్రామం రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాల వలన జరిగిన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేసి గ్రామ కమిటీ, మండల కమిటీలతో ఆమోదించి వెంటనే జిల్లా కేంద్రానికి పంపించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ నెల 15 నాటికి ఈ క్రాప్ రైతుల ఈకేవైసీలను పూర్తి చేసి, జాబితాలను సామాజిక తనిఖీల కోసం ప్రదర్శించాలని వీఏఏలను ఆదేశించారు. భారీ వర్షాల తర్వాత వరిపంటలో తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, పి.భావన తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకానికి 4,554 దరఖాస్తులు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విశ్వకర్మ పథకానికి సబ్బవరం మండలంలోని 24 పంచాయతీల నుంచి 4,554 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో రమేష్‌నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించాక 422 మంది టైలర్లు, 30 మంది మేస్త్రీలను అర్హులుగా గుర్తించామన్నారు. అత్యధికంగా సబ్బవరం పంచాయతీ నుంచి, అత్యల్పంగా రాయపుర అగ్రహారం నుంచి అర్హులున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరం పంచాయతీ నుంచి 1,044 మంది దరఖాస్తు చేసుకోగా 97 మంది టైలర్లు, ఒక మేస్త్రి, రాయపుర అగ్రహారం నుంచి 47 దరఖాస్తులు రాగా ఒక టైలర్ మాత్రమే ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ జాబితాను ప్రభుత్వ ఆమోదం కోసం పంపించినట్లు పేర్కొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలకు ఫిర్యాదు



ఫిర్యాదు కాపీ చూపిస్తున్న రైతు అప్పలరాజు

మునగపాక : మండలంలోని గణపర్తి శారదా నది సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మారిశెట్టి అప్పలరాజు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శారదా నదిపై నరసాపురం ఆనకట్ట నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని కొంత మంది రైతులు ఆక్రమించి అడ్డదారిలో పట్టాదారు పుస్తకాలు పొందారన్నారు. ఇప్పటికే ఆర్‌డీవో కార్యాలయం అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణ దారులకు కొంతమంది అధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అడ్డదారిలో పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డీటీ వినయ్‌ను వివరణ కోరగా ఆక్రమణకు సంబంధించి అందిన ఫిర్యాదుపై విచారణ చేపడతున్నామన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలో ప్రతిభ

కశింకోట: జాతీయ స్థాయి యోగా పోటీలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇటీవల బి.కె.ఎస్ అయ్యంగార్ జ్ఞాపకార్థంగా ఈ పోటీలో 3వ తరగతి విద్యార్థి ఎం. దేవజ్ఞ విజయకేతనం ఎగుర వేశాడు. ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ బృందం దేవజ్ఞనను గురువారం అభినందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నృత్య కళాకారులను మెమెంటోలతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల: వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో గణనాథుడి విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సీతారామరాజునగర్‌లో శ్రీ బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నర్సీపట్నానికి చెందిన నృత్య కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులను నృత్య ప్రదర్శనలతో కట్టిపడేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు.

నేడు శారదామాతకు గంగా హారతి



అనకాపల్లి: ఉమా సమేత రామలింగేశ్వర దేవస్థానం సమీపంలో స్థానిక శారదానది ఒడ్డున శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శారదామాతకు ''గంగా హారతి'' ఇవ్వనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రఘు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి: తుమ్మపాల పంచాయతీ పరిధి విద్యుత్ నగర్‌లో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, దశల వారీగా పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా ప్రాంతాల ప్రజల సహకారంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంచాయతీ రాజ్ ఏఈ పి.ఆర్.కుమార్ రాజు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, 14, 15 వార్డు మెంబర్లు కొయ్యా జగదలక్ష్మీభాస్కర్, అంగులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి మృతికి పలువురు సంతాపం తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, ప్రతినిధి ఆర్. అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ



జమాదులపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ స్మైల్

కశింకోట: మండలంలోని జమాదులపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో పోషణ మాసోత్సవాలపై స్వయం సహాయక సంఘాల సభ్యులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందితో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ స్మైల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. మహిళలు పెరటిలో కూరగాయల పెంపకం చేపట్టాలని సూచించారు. పిల్లల ఎదుగుదల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సంఘాల పుస్తకాల నిర్వహణ, ముద్రా రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన గురించి అవగాహన కలిగించారు. అంగన్వాడీ కార్యకర్త సూర్యకుమారి, సీసీ రామకృష్ణ, వీవోఏ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆకుముడత తెగులు



వరిలో ఆకుముడత తెగులు సోకిన పొలం

బుచ్చెయ్యపేట : వరి పొలాల్లో విస్తారంగా వ్యాపిస్తున్న ఆకుముడత తెగులు నిరారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవికే) ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. గురువారం వీరు మండల కేంద్రం బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కొమళ్లపూడి, లోపూడి తదితర గ్రామాల్లో రైతుల వరి పొలాలను పరిశీలించారు. ఇటీవల పది రోజులుగా ఏర్పడ్డ తుఫాను వర్షాలకు వాతావరణం చల్లగా ఉండడంతో వరి పొలాల్లో ఆకుముడత పురుగు ఎక్కువగా ఆశించినట్టు గుర్తించారు. వరి ఆకులు నిలువునా ముడుచుకుని ఉంటాయని, ఆకుమడతలు విప్పి చూడగా పసుపు లేదా ఆకుపచ్చ గొంగలి పురుగులు కనిపించిన పొలంలోకి దిగితే రెక్కల పురుగులు ఎగిరిన ఆకుముడత పురుగు ఆశించినట్టుగా రైతులు గుర్తించాలన్నారు. వెంటనే పొడవాటి తాడు చివర్లను ఇద్దరు మనుషులు పట్టుకుని రెండు గట్లు మీద నుండి వరి ఆకుల మీద నుండి లాగుతూ ఉంటే పురుగులు కింద ఉన్న నీటిలో పడతాయన్నారు. వెంటనే పొలంలో ఉన్న నీటిని బయటకు తీయడం వల్ల పురుగు నీటిలో కొట్టుకుపోయి తెగులు బెడద తప్పుతుందన్నారు. వరి పొలంలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం వల్ల పురుగును నివారించవచ్చన్నారు. 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు 400 గ్రాముల పొడి మందును పంటంతా తడిచేలా పిచికారి చేయాలన్నారు. అలాగే ఫ్లూబెండమైడ్ 20 డబ్లుడీజీ మందును లీటరు నీటిలో 0.25 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. ఎకరాకు 50 గ్రాముల మందును పిచికారి చేయాలన్నారు. క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్‌సి మందును 60 మిల్లీలీటర్లు మందును ఎకరాకు పరిసడ్డ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. పై మందుల్లో ఏదో ఒక మందును ఆకుముడత తగిలిన వరి పొలానికి పిచికారి చేస్తే ఆకుముడతతో పాటు కాండం తొలిచే పురుగు నివారణ అవుతుందన్నారు.

అగ్గి తెగులు, పొడతెగులు నివారణ

వరిలో అగ్గి తెగులు కనిపిస్తే యూరియా వాడకాన్ని తగ్గించి ట్రైసైక్లోజోల్ పొడిమందును లీటరు నీటిలో 0.6 గ్రాముల చొప్పున ఎకరాకు 120 గ్రాముల మందును పిచికారి చేయాలన్నారు. వరిలో పాము పొడ తెగులు లేదా పాచి తెగులు లక్షణాలు కనిపిస్తే హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ లేదా వాలిడామైసిన్ మందును పిచికారి చేయాలన్నారు. పొలం గట్లకు కూడా మందును పిచికారి చేయాలని సూచించారు.

కిసాన్ మిత్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం మండలం హరిపాలెంలో గురువారం బలరాం జయంతి ఘనంగా నిర్వహించారు. కిసాన్ మహిళా మిత్ర ఏపీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా మిత్ర చైర్మన్ సురేష్ పాల్గొని మాట్లాడారు. కిసాన్ మిత్ర ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.40 లక్షల విలువ చేసే పైపులను అందజేస్తున్నారన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో అనకాపల్లిలో రైతు మేళా జరుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే పంటలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐసీ ప్రతినిధి రంజిత, కొండకర్ల ఎంపీటీసీ శ్రీను, జోగినాయుడు, కిరణ్‌కుమార్, కిసాన్ మహిళా మిత్ర ఎఫ్‌పీవో రాజు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com